www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 12 డిసెంబర్ 2023

టిడ్కో ఇళ్లు అప్పగించాలని సిపిఎం వినతి

వినతిని అందిస్తున్న నేతలు

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలో చేపట్టిన టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూజివీడులో జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిని అందించారు. అనంతరం రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 'నిరు పేదలకు ఇల్లు' పథకం ద్వారా ఎంఆర్.అప్పారావు కాలనీలో జిప్లస్3 ఇళ్ల నిర్మాణం చేపట్టి లబ్ధిదారుల నుండి మూడు కేటగిరీలుగా విభజించి ఒక్కో లబ్ధిదారుని నుంచి రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25వేలు చొప్పున వసూలు చేశారు. కానీ నేటికీ ఇళ్లు పూర్తిచేసి అప్పగించలేదని, తక్షణం వారికి న్యాయం చేయాలని కోరారు. సొంతిల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శోభనాద్రి, మరియదాసు, ప్రభాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'కొల్లేరు'కు వరద..!

- అగమ్యగోచరంగా కొల్లేరు ప్రాంత గ్రామాల్లో దాళ్వా సాగు
- పలు మండలాల్లో వేలాది ఎకరాల సాగుపై అయోమయం
- ముంపుబారిన ఇప్పటికే వేసిన నారుమడులు
- మళ్లీ నారుమడులు వేయాల్సిన పరిస్థితి
- డిసెంబర్ నెలాఖరుకు నారుమడుల పూర్తి అనుమానమే
- సన్న, చిన్నకారు రైతుల పొలాలన్నీ కొల్లేరుకు ఆనుకునే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరుకు ఆనుకుని ఉన్న గ్రామాల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మిచౌంగ్ తుపానుతో కురిసిన భారీ వర్షాల వల్ల కొల్లేరుకు వరదనీరు పోటెత్తడంతో దాళ్వాసాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది. రోజురోజుకీ వరద నీరు పెరగడంతో ఇప్పటికే వేసిన నారుమడులన్నీ ముంపునకు గురయ్యాయి. నారుమడులను వరద నీటి నుంచి కాపాడుకునే అవకాశం లేకపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కొల్లేరును ఆనుకుని నిడమర్రు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, కైకలూరు, ఆకివీడు వంటి మండలాలు ఉన్నాయి. ఈ మండలాలకు చెందిన పలు గ్రామాలకు చెందిన పొలాలు కొల్లేరుకు ఆనుకుని ఉన్నాయి. ఐదో కాంటూరుకు పైన పట్టాభూములతోపాటు అసైన్ భూములు ఉన్నాయి. ఈ మండలాల్లో దాదాపు నాలుగైదు వేల ఎకరాలకుపైగా భూముల్లో రైతులు దాళ్వాలో వరిసాగు చేస్తుంటారు. వర్షాలు, వరదల కారణంగా కొల్లేరుకు ఆనుకుని ఉన్న భూముల్లో రైతులు ఖరీఫ్ పంట సాగు చేయరు. దాళ్వా మాత్రమే సాగు చేస్తారు. దీంతో ఇప్పటికే నిడమర్రు మండలం అడవికొలనుతోపాటు పలు గ్రామాలకు చెందిన రైతులు దాళ్వా నారుమడులు వేయడం జరిగింది. తుపాను దెబ్బకు కొల్లేరుకు వరద నీరు పోటెత్తడంతో నారుమడులన్నీ మునిగిపోయాయి. ఎకరాకు రూ.రెండు వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. వరద పోటు ఇప్పటికీ తగ్గకపోవడంతో దాళ్వా సాగుపై అయోమయం నెలకొంది. మళ్లీ నారుమడులు వేస్తే తప్ప దాళ్వాసాగు చేసేందుకు వీల్లేని పరిస్థితి నెలకొంది. కొల్లేరును ఆనుకుని ఉన్న పొలాలన్నీ సన్న, చిన్నకారు రైతులకు సంబంధించినవే 80 శాతం ఉన్నాయి. దాళ్వా సాగు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. మళ్లీ దాళ్వా వరకూ సాగు చేసుకునే అవకాశం ఉండదు. దీంతో రైతులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

నెలాఖరుకు నారుమడులు పూర్తయ్యేనా..!

చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వరద నీరంతా కొల్లేరులోకే ప్రవేశిస్తోంది. దీంతో కొల్లేరుకు వరదనీరు రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. కొల్లేరు పొలాల్లో నడుము లోతు వరకూ వరద నీరు చేరినట్లు రైతులు చెబుతున్నారు. డిసెంబర్ నెలాఖరుకు కూడా నారుమడులు పూర్తవుతాయో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అదే జరిగితే దాళ్వా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ నెలాఖరుకు నారుమడులు పూర్తయితే ఫిబ్రవరి 15వ తేదీ వరకూ నాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది. ఇంకా నారుమడులు ఆలస్యమైతే నాట్లు మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. అప్పుడు మే నెలాఖరుకు పంట చివరిదశకు చేరుకుంటుంది. అప్పుడు అకాల వర్షాలు, తీవ్రమైన ఎండలు రైతులను వెంటాడనున్నాయి. అంతేకాకుండా నాట్లు ఆలస్యమైతే దిగుబడి సైతం తగ్గే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో కొల్లేరుకు ఆనుకుని ఉన్న గ్రామాల రైతుల పరిస్థితి అయోమయంగా మారింది.

కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తీస్తేనే నీరు తగ్గుముఖం

కొల్లేరులోకి వచ్చిన వరద నీరు త్వరితగతిన తగ్గాలంటే కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క వంటివి వెంటనే తొలగించాలి. కొల్లేరులోని కాలువలన్నింటిలోనూ తక్షణం బాగుచేత పనులు చేపట్టాలి. కాలువల్లో అడ్డంకులు తొలగితే వరదనీరు తగ్గి నారుమడులు త్వరగా వేసుకునే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గురించి ఆలోచన చేయాలని కొల్లేరు రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

తుపాను, కరువు నష్టంపై రాజకీయ పక్షాల, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తుపాన్, కరువు నష్టాన్ని జాతీయవిపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి తక్షణసాయంగా రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలని రాజకీయపక్షాలు, వివిధ ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సోమవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలోని సుర్తి భవనంలో రాజకీయ పక్షాలు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, ఎఐటియుసి, మహిళా సమాఖ్య, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పంట నష్టపోతే ప్రభుత్వం కేవలం 1.47 హెక్టార్లలో మాత్రమే పంట నష్టం జరిగిందని చెప్పడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తడిసిన ధాన్యం రంగుమారిన, వాసన వస్తుందని, ధాన్యం ఏ స్థితిలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని ప్రకటించిన సిఎం జగన్ దానికి అనుగుణంగా ఆదేశాలు జారీ చేయకపోవడం నియంతృత్వ పోకడలకు నిదర్శనమని విమర్శించారు. తక్షణం ఎన్యూమరేషన్ ప్రారంభించి, నష్టపరిహారం చెల్లించడానికి మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తుపాను, కరువు నష్టాలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 14వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీర్మానాలను ప్రవేశపెట్టారు. నష్టపోయిన పంటలను గుర్తించి పొరపాట్లకు తావు లేకుండా ఎన్యూమరేషన్ చేయాలన్నారు. ఎక్కువ వర్షపాతం నమోదైన 470 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, అన్ని పంటలకు పంటల బీమా వర్తింపచేయాలని, అన్ని రకాల రుణాలు మాఫీ చేసి, విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్ల రైతులకు కోలుకోలేని నష్టం సంభవించిందన్నారు. ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టలేదన్నారు. 35 శాతం పంట నష్టం జరిగితేనే ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులని ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. అక్రమాలకు తావులేకుండా ఎన్యూమరేషన్ తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో 80 శాతం మంది కౌలు రైతులున్నారని, పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు రాజు మాట్లాడుతూ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు మాట్లాడుతూ ప్రధాని మోడీ మన రాష్ట్రంపై తీవ్రనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం జగన్ కేంద్రాన్ని నిలదీయలేకపోవడం ఆయన నిస్సహాయ స్థితిని తెలియజేస్తున్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ధర్నాకు పూర్తి మద్దతు ప్రకటించారు. జనసేన నాయకులు నరేష్ మాట్లాడుతూ నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతాంగానికి భరోసా కల్పించడంలో జగన్ మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రవేశపెట్టిన తీర్మానాలను అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈ సమావేశంలో ఎఐటియుసి నగర అధ్యక్షులు కృష్ణమాచార్యులు, భారత బచావో జిల్లా నాయకులు నాగేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు మండల కార్యదర్శి పి.పెంటయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కన్నబాబు, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి గొర్లి స్వాతి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఐలు నాయకులు

భూహక్కుల చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

భూ హక్కుల చట్టం (27/2023) ద్వారా భూముల లావాదేవీలపై అధికార పార్టీ, భూకబ్జాదారుల పెత్తనం పెరుగుతుందని, చట్టం రద్దు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లాకోర్టు ఆవరణలో ఐలూ నగర కమిటీ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. శైలజ, ఏలూరు నగర అధ్యక్షులు పి.వెంకట్, కార్యదర్శి గెద్దా విజయభాస్కర్, నగర కమిటీ సభ్యులు సతీష్ బృందం ఐలు ముద్రించిన చీకటి చట్టం ప్రమాదాలపై ముద్రించిన కరపత్రాలను న్యాయవాదులకు, కక్షిదారులకు, కోర్టులో పిటిషన్‌దారులకు పంపిణీ చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు భూ కబ్జాలను ప్రోత్సహించే ఈ చీకటి చట్టం రద్దు చేయా నినదించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ భూ హక్కుల సమస్యలను ప్రపంచ బ్యాంక్ ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకే 15 చట్టాలను గాలికి వదిలేసి, కోర్టుల పరిధి నుంచి అధికార పార్టీ ఏజెంట్లుగా ఉండే లేదా ప్రలోభాలకు ఆశపడి నిర్ణయాలు చేసే అధికారులకు అప్పగించడం సరికాదన్నారు. దీని వల్ల పేద రైతులుకు తీవ్ర నష్టదాయకమని, సివిల్ కోర్టులో భూ హక్కుల గురించి పేద రైతులకు తమ హక్కులు నిరూపించుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మేధావులందరూ రైతులను, ప్రజలను చైతన్యపరచాలని కోరారు. ఐలు నగర అధ్యక్షులు పుచ్చల వెంకట్, కార్యదర్శి గెద్దా విజయ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 553 కోర్టులు తీర్చలేని భూ హక్కుల వివాదాలను 26 మంది అధికారులకు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జాన్సన్, వెదుళ్ల రాంబాబు, ఆర్.గంగా భవాని, పి.నాగేంద్రపాల్, రాజు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు, అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు

12 నుంచి ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 12వ తేదీ నుండి అంగన్‌వాడీలు చేపడుతున్న రాష్ట్రవ్యాప్త నిరవధికసమ్మెకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు ప్రజాసంఘాలు పూర్తిమద్దతు తెలిపాయి. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్ఆర్ పేటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.ఐదు లక్షల గ్రాడ్యుటీ చెల్లించాలని, తెలంగాణలోకన్న అదనంగా వేతనాలిస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వి.రామారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు కెవి.రమణ, బద్దా వెంకట్రావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు పివి.నరసింహారావు, ఆర్‌టిసి ఎంప్లాయిస్ నాయకులు సిహెచ్ఎస్.రావు, విఆర్ఎల నాయకులు ఎస్‌కె.సుభాషిణి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు టిహెచ్.దేవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు, సిఐటియు ఏలూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాథరావు, వి.సాయిబాబు తమ సంఘీభావం తెలిపారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.విజయలక్ష్మి, నాయకులు హైమావతి, భవాని, సీతామహాలక్ష్మి, సోములమ్మ, రాజకుమారి, రామలక్ష్మి, మాణిక్యం పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతుల గోడు పట్టదా..!

రెండేళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు - పట్టించుకోని పరిస్థితి - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి

నాసిరకం ఆయిల్‌పామ్ మొక్కలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయామని మండలంలోని నామవరం, శెట్టివారిగూడెం, పట్టాయగూడెం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ నూజివీడులో సోమవారం జరిగిన స్పందనలో రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. 2014-15 సంవత్సరంలో గోద్రేజ్ ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ యాజమాన్యం మండలంలో 60 ఎకరాలకు ఆయిల్‌పామ్ మొక్కలు సరఫరా చేసింది. మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ దిగుబడి మాత్రం రావడం లేదు. ఏడాదిక్రితం నాణ్యతాలోపం వల్లే దిగుబడి తగ్గిపోయిందని శాస్త్రవేత్తలు సైతం పరిశీలించి నివేదిక ఇచ్చారు. ఈ క్రమంలో అప్పట్లో ఉన్నతాధికారులు విచారణ నిమిత్త జిల్లాస్థాయి అధికారి పాండురంగన్ ఏర్పాటు చేసి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎకరాకు 12 టన్నుల దిగుబడి రావాల్సిన ఆయిల్‌పామ్ గెలలు, కేవలం రెండు టన్నులు మాత్రమే వస్తుందని రైతులు వివరించారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, కానీ ఆశించిన దిగుబడి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కనీసం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నష్టపోయిన ఆయిల్‌పామ్ రైతులు

న్యాయం చేయండి

భూక్యా లాలు, ఆయిల్‌పామ్ రైతు, నామవరం

గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీకి చెందిన పామాయిల్ మొక్కలు వేశాను. అవి నాశిరకంగా ఉండటతో ఆశించిన దిగుబడి రావడం లేదు. రైతులకు న్యాయం చేయండి. సమగ్ర విచారణ చేపట్టి తమను ఆదుకోండి.

రైతులకు న్యాయం చేస్తాం

రామన్, ఉద్యానవన శాఖ డిడి.

రైతులకు న్యాయం చేస్తాం. ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా చూస్తాం. దీనిపై గోద్రేజ్ ఆగ్రోవెట్ యాజమాన్యంతో మాట్లాడి నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం.

తడిసిన ధాన్యం మద్దతు ధరకు కొనాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మిచౌంగ్ తుపాన్ వల్ల జరిగిన పంట నష్టాల నమోదులో 35శాతంపైగా జరిగిన నష్టాలనే నమోదు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం ఏలూరు రూరల్ మండలంలోని లింగారావుగూడెంలో తుపాన్ వల్ల నేలకొరిగిన వరి పంటలను రైతుసంఘం నాయకులు పరిశీలించారు. మొలకలొచ్చిన వరి కంకులతో నినాదాలు చేస్తూ రైతులు, కౌలు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తుపాన్ వల్ల అన్నదాతలకు అపార నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాల నమోదుకు, తడిసిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం తగదన్నారు. పంట ఏ మేరకు నష్టం జరిగినా నష్టం నమోదు చేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎకరాకు వరికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. పంట నష్టాల నమోదులో ఈ క్రాప్‌తో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పేర్లను నమోదు చేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. పంటల బీమా పథకం వర్తింపజేయడం కోరారు. తడిసిన, రంగుమారిన, మొలకొచ్చిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను, కౌలు రైతులను సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఎలికే డేవిడ్‌రాజు, మారుమూడి పౌలు, మారుమూడి సుధాకర్, నూలు ఆంజనేయులు, కాటి గంగారావు, కాటి కృష్ణ, కె.అర్జయ్య, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి చేలో నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

ఉద్యోగాల కోసం దళారులను ఆశ్రయించొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నిరుద్యోగులు వారి ప్రతిభ ప్రకారం ఉద్యోగాలు సంపాధించే అవకాశం ఉంటుందని మధ్యవర్తుల మాట నమ్మి మోసపోవద్దని, అలాంటి వారు ఎదురైతే తమకు తెలియచేయాలని జిల్లా ఎస్‌పి ప్రశాంతి అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిసోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి ఆయా పరిధిలోని పోలీసు సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ సంబంధిత వ్యాజ్యాలను పోలీసులు పరిష్కరించే అవకాశం లేదని, అలాంటివి కోర్టుల్లోనే పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నోటిఫికేషన్లు జారీ చేస్తున్న నేపథ్యంలో ఎవరూ దళారుల మాటలు నమ్మొద్దని, అభ్యర్థుల ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని ఆమె సూచించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు ఫిర్యాదులను ఎస్‌పికి అందించారు.

ఏడేళ్లలోపు శిక్ష తగ్గింపుపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏడేళ్లలోపు శిక్ష కేసుల్లో ఇరుపక్షాలను ఒప్పించి శిక్ష తగ్గించే విధానంపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక న్యాయ సేవాధికార సంస్థ భవనంలో పోలీస్ సిబ్బందికి, న్యాయవాదులకు, పారాలీగల్ వాలంటీర్లలకు ప్లీ భార్గెన్ ద్వారా కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్ష తగ్గించే విధానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పిడిబిటి జూనియర్ కాలేజీలో మానవహక్కుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పౌర స్వేచ్ఛా జీవితానికి ఆటకం కలిగించడం పౌర హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, అలాంటివారు జిల్లాన్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయమందిస్తారని తెలిపారు. అలాగే పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ విద్య, వైద్యం, బ్యాంకింగ్, బీమా, రవాణా తదితర పది సేవలపై అదాలత్‌ను ఆశ్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె.రత్నప్రసాద్

నేడు గాలాయగూడెంలో గవర్నర్ పర్యటన

వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు హాజరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయగూడెంలో పర్యటించనున్నారు. ఉదయం 9.15 గంటలకు రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి 10.50 గంటలకు గాలాయిగూడెం చేరుకుంటారు. 11 గంటల నుంచి 12.40 గంటల వరకూ వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు. అనంతరం 12.45 గంటలకు గాలాయిగూడెం నుంచి తిరిగి రాజభవన్‌కు బయలుదేరతారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

రిలేదీక్ష చేపట్టిన గిరిజనులు, నాయకులు

మర్లగూడెంలో భూసమస్య పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మర్లగూడెంలోని 36 ఎకరాల ఎల్‌టిఆర్ భూ సమస్యను పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో కెఆర్.పురం ఐటిడిఎ వద్ద గిరిజనులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్లు 39, 40, 41, 43/3లో సుమారు 36 ఎకరాల 1/70 చట్టం భూములను మర్లగూడెంలోని గిరిజనులు గత 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుని జీవిస్తున్నారని, ఈ భూములపై ఆర్‌డిఒ చట్ట విరుద్ధంగా గిరిజనేతరులకు పోలీస్ ప్రొటెక్షన్ ఇచ్చి గిరిజనులను భూముల నుండి దౌర్జన్యంగా బయటికి గెంటివేసి తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. ఈ భూముల్లో గిరిజనేతరులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. గిరిజనేతరులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నప్పటికీ పట్టించుకోని రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఐటిడిఎ పిఒ కోర్టులో ఉన్న ఈ కేసును సత్వరం విచారం చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. ఈ దీక్షలో మడక వెంకటేశ్వరరావు, పూసం దుర్గారావు, సోయం శ్రీను, తాతి నాగమ్మ, మడకం లక్ష్మి, పూసం రాములమ్మ పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పంట నష్టం : టిడిపి

ప్రజాశక్తి - భీమడోలు

మిచౌంగ్ తుపాన్ కారణంగా ఉంగుటూరు నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. నష్టాన్ని అంచనా వేసేందుకు టిడిపి బృందం సోమవారం పర్యటించింది. ఈ బృందంలో గన్నితోపాటు చింతలపూడి మాజీ ఎంఎల్ఎ మురళీకృష్ణ, పార్టీ ఏలూరు ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ, టిడిపి ప్రముఖులు సిహెచ్.గాంధీ, షేక్ మీరా, కరణం పెద్దిరాజు, బొమ్మిడి అప్పారావు ఉన్నారు. రైతులను కలిసి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భీమడోలులోని పార్టీ కార్యాలయంలో గన్ని మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోని కారణంగా రైతులు నష్టపోయారని విమర్శించారు. నియోజకవర్గ పరిధిలోని మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో రూ.22 కోట్ల విలువ గల పంట నష్టం జరిగిందన్నారు. కొల్లేరు ప్రాంతంలో పదివేల ఎకరాల విస్తీర్ణంలో సాంప్రదాయ రీతిలో వరిసాగు చేసిన రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారన్నారు. వారిని ఆదుకునేందుకు పూర్తిసబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలని, పెట్టుబడి నష్టాలను ప్రభుత్వం చెల్లించాలని కోరారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా

నూజివీడు రూరల్ : నియోజకవర్గ పరిధిలోని జగనన్న కాలనీ లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్లను అందించేందుకు శ్రీకారం చుట్టినట్టు ఇఇ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్, హౌసింగ్ ఐడీలతో ఏఈలను సంప్రదించాలన్నారు. ఒక కిలో వాట్ లోపు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ మీటర్లను, బోర్డులను లబ్ధిదారులకు ఉచితంగానే అందిస్తామని తెలియజేశారు.

లోక్ అదాలత్‌లో 591 కేసుల పరిష్కారం

నూజివీడు రూరల్ : పట్టణంలోని 15వ అదనపు జిల్లా కోర్టులో సోమవారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 591 కేసులను పరిష్కరించినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ నేతృత్వంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఎంఎపి కేసులు 7, సివిల్ కేసులు 24, క్రిమినల్ కేసులు 133, చెక్ బౌన్స్ కేసులు 9, వివాహ సంబంధ కేసులు 4, ఎస్‌టిసి కేసులు 405, ప్రీ లిటిగేషన్ కేసులు 9 పరిష్కరించామని తెలియజేశారు.

వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

ఆగిరిపల్లి : వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని ఆగిరిపల్లి మండల విద్యాశాఖాధికారి-1 కె.రత్నకుమారి అన్నారు. సోమవారం ఆగిరిపల్లి ఎంపిఆర్‌సి భవన్ ప్రాంగణంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఒలింపిక్ గేమ్స్‌లో విజేతలైన దినేష్, లక్ష్మీ అంకేశ్వరి, శ్యామల బాబులకు సర్టిఫికెట్స్‌ను, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ-2 కె.ఆనందకుమార్, ప్రధానోపాధ్యాయులు డి.విజయదుర్గ, ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు కె.యూన్సీ, బి.రవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

చింతలపూడి : పట్టణంలో ఉన్న డాక్టర్ అంబేద్కర్ విద్యార్థుల ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు తక్షణంగానే శాశ్వత పరిష్కారం చూపించాలని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ కన్వీనర్ జోసెఫ్ తంబి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ కమిటీ పాఠశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహశీల్దార్ కృష్ణజ్యోతికి సమస్యలు పరిష్కరించాలని వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ కన్వీనర్ జయబాబు, కామవరపుకోట ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు కోలికిపాము రామకృష్ణ, సీనియర్ ఎంఆర్‌పిఎస్ నాయకులు కొంకలూరి రాజు పాల్గొన్నారు.

రంగప్రసాద్‌కు జాతీయ పురస్కారం

జంగారెడ్డిగూడెం : మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామివారి దేవస్థానం స్థానాచార్యులు వేదాంతం వెంకట శేష రంగ ప్రసాద్ తెలుగు వెలుగు విశిష్ట కళా ప్రపూర్ణ జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈనెల 10న విజయవాడలో జరిగిన జాతీయ స్వర్ణంధ్ర సేవా సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనం-2023లో జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం చెందిన వేదాంతం వెంకట శేష రంగ ప్రసాద్ జోతిష్యం, వాస్తు శాస్త్రములలో విశిష్టమైన కృషి చేసినందుకు ఈ పురస్కారం అందుకున్నారు. విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత విజిలెన్స్ డిఐజి వంగాల శాంతి కృష్ణ ఆజాద్, విశ్రాంత ఐఎఎస్ అధికారి మానేపల్లి సుబ్రహ్మణ్యం, సీనియర్ ఐపిఎస్ అధికారి ద్వారకాతిరుమలరావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దంతు సాంబ శివరావుల చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేసినట్టు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వర్ణంధ్ర సేవా సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ పోలోజు రాజ్ కుమార్ చార్యులు, జాతీయ కన్వీనర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్, డాక్టర్ వలబోజు మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

చింతలపూడి : క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి మొలుగుమాటి నీరజసుధాకర్ అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పూర్తిస్థాయి వైద్య సేవలందించాలి

మండవల్లి : మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్.ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో తహశీల్దార్ రాజకుమార్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 22 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామ ప్రభుత్వం 24 గంటలు వైద్య సేవలందించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు నేటికీ నిర్లక్ష్యం చేస్తూ ఉదాసీనంగా నిర్లక్ష్యంచేయడం బాధాకరమని అన్నారు. కైకలూరు నియోజకవర్గంలోని కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో ఏనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు పనిచేస్తూ రోగులకు వైద్య సేవలు అందిస్తుండగా కేవలం మండవల్లి మాత్రమే ఎనిమిది గంటలు అది కూడా అసంపూర్తిగా విధులు నిర్వహిస్తున్న పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. అత్యవసర సమయాల్లో, రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేసి 24 గంటలు పూర్తిస్థాయిలో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు, బండి రాంబాబు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో అన్న సమారాధన

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శ్రీకరిడి సాయిబాబా మొదటి వార్షికోత్సవంలో భాగంగా దాతలు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైసిపి నాయకులు బొండాడ వెంకన్నబాబు హాజరై బాబాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల సొసైటీ అధ్యక్షులు గుర్రాల లక్ష్మణ్, డిసిఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకటకృష్ణారెడ్డి, డిజి శ్రీనివాసరావు, డిజి, చిలుకూరి శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీ సరోజా రెడ్డికి మధుర కవిభూషణ పురస్కారం

జంగారెడ్డిగూడెం : స్థానిక ప్రతిభా స్కూల్ ప్రిన్సిపల్ కసర లక్ష్మీ సరోజా రెడ్డికి కవిభూషణ పురస్కారం లభించింది. ఈస్ట్ సమ్మయ్య రూపొందించిన నూతన తెలుగు లఘు కవితా ప్రక్రియ మధురిమలులో 200కు పైగా కవితలు రచించిన కసర లక్ష్మీ సరోజా రెడ్డి సాహిత్య కృషిని ప్రశంసిస్తూ మేఘన సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో మధుర కవి భూషణ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు, ప్రతిభా ఇంగ్లీష్ మీడియం స్కూల్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

మద్ది ఆలయంలో యాత్రికుల రద్దీ

జంగారెడ్డిగూడెం : మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాలలో భాగంగా అధిక సంఖ్యలో యాత్రికులు ఆలయాన్ని సందర్శించారు. సోమవారం ఆలయాన్ని సందర్శించిన యాత్రికులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు.

అర్హులందరికీ అభివృద్ధి ఫలాలు

ముదినేపల్లి : అర్హులందరికీ మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చూడాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టాప్రోలు కృష్ణ అన్నారు. మండలంలోని వైవాకలో సోమవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానిమోడీ పదిపాలనలో పథకాలు అందరు ఉపయోగించుకొని సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నున్న వర్మయాది, మాజీ సర్పంచి బిజెపి సీనియర్ నాయకులు కొత్తపల్లి లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా 'విజిబుల్ పోలీసింగ్'

ఏలూరు స్పోర్ట్స్ : జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ లో సోమవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. సాధారణంగా వారానికి ఒక మారు పోలీసు శాఖ విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ఉంటుంది. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన పోలీసింగ్‌లో గంజాయి, మద్యం, నాటు సారా అంటి వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది, విజిబుల్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అస్తవ్యస్తంగా జాతీయ రహదారి

ప్రమాదాల బారిన వాహనదారులు, ప్రజలు పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

జాతీయ రహదారి అభివృద్ధి పనులు వాహనదారులు, ప్రజల పాలిట శాపంగా మారాయి. కాంట్రాక్టర్ పనులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొని వాహనదారులకు భద్రత, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు కాంట్రాక్టర్ ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్‌కు జవాబు దారితనంగా ఉంటున్నారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ద్విచక్ర వాహనం గోతిలో పడిన సంఘటనలో ఒక పోలీసికి నడుముతో పాటు పక్కటెముకలు విరిగిన సంఘటన ఇందుకు నిదర్శనమని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. దీంతో విస్తరణ పనులు పూర్తయ్యే నాటికి ఇంకెంత మంది వాహనదారులు, ప్రజలు క్షతగాత్రులుగా మిగులుతారోనని ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు.

పెద్ద పెద్ద గుంతలతో జాతీయ రహదారి

వాహనదారులు, ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం పామర్రు, దిగమర్రు జాతీయ రహదారి 165 పామర్రు నుంచి ఆకివీడు వరకు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. అయితే కాంట్రాక్టర్ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు నిర్వహించడంతో పాటు పనులు నిర్వహించే ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్ పనులను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకుండా రహదారిని ముక్కలుగా నిర్మించి కలపకుండా నిర్లక్ష్యంగా వదిలి వేశాడని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. దీంతో ఎక్కడ గోయుందో, ఎక్కడ రహదారి వెయ్యకుండా ఆపేశారో తెలియకపోవడంతో రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేక్రమంలో విధులకు వస్తున్న ఓ పోలీస్ రహదారిని అసంపూర్తిగా వదిలేసిన ప్రాంతంలో సూచక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో చిన్నపాంపర్రు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి గోతిలో పడిన సంఘటనలో ఆ పోలీసుకు నడుంతో పాటు పక్కటెముకలు విరిగిపోయిన సంఘటన చోటు చేసుకుందని ప్రజలు వివరిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోయినా అధికారులు కాసుల మునుగులో చూసి చూడనట్టు వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. అయితే వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని అయితే వెలుగులోకి రాని సంఘటనలు ఎన్నో ఉన్నాయని ప్రజలు వివరిస్తున్నారు. ప్రమాదాలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రమాదాలు జరగకుండా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమంటున్నారు. అయి నప్పటికీ అధికారులు ఎవరూ అటు దిశగా కన్నెత్తి కూడా చూడకపోవడంతో నన్ను అడ్డుకునే వారు ఉన్నారా అనే గర్వాన్ని వ్యక్తం చేస్తూ కాంట్రాక్టర్ నిర్వహిస్తున్న పనుల వల్ల రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయని వాటిగుండా ఎలా ప్రయాణించాలని అటు వాహనదారులు, ఇటు ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా మండలంలోని చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఆ గోతుల్లో ప్రయాణిస్తున్నప్పటికీ గోతులు ఎందుకు పడ్డాయని గాని, రహదారిని ముక్కలు ముక్కలుగా నిర్మించి అసంపూర్తిగా ఎందుకు వదిలేశారని ప్రశ్నించకపోవడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ప్రమాద సంఘటనలు చోటు చేసుకుంటున్న జాతీయ రహదారులకు చెందిన అధికారులకు కాసుల మునుగులో పట్టించుకోకపోవడం ఎం తవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా పరిస్థితిని పరిశీలించి కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. దీనిపై ఎన్‌హెచ్ సత్యనారాయణను, ఎఇ శరత్‌ను ఫోన్లో వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

'భోజనం తినలేక పడేస్తున్నాం'

ప్రజాశక్తి - చింతలపూడి

భోజనం రుచిగా ఉండటం లేదని, తినలేక పోతున్నామని, ఒక్క శుక్రవారం మాత్రమే కడుపునిండా భోజనం చేస్తున్నామని చింతలపూడి మండలం రాఘవపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రాఘవపురంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనం విద్యార్థులు తినలేక బయట పడేస్తున్న సంఘటన చోటు చేసుకుంది. దీనిపై విద్యార్థులను అడగగా భోజనం, కూరలు బాగోటం లేదని, తినబుద్ధి కావటం లేదని, అందుకే పడేస్తున్నామని చెబుతున్నారు. వంటలు బాగుండే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యార్థులు ఉన్నత అధికారులను కోరుతున్నారు. దీనిపై మండల విద్యాశాఖాధికారి కిరణ్ బాబును వివరణ అడుగగా పాఠశాలను సందర్శించి, విద్యార్థుల నుంచి సమాచారం తీసుకున్నామని, పైఅధికారులకు నివేదికను అందజేస్తామని తెలిపారు.

ఇల్లు కాలిపోయిన బాధితులకు సహాయం

జీలుగుమిల్లి : మండలంలోని దిబ్బగూడెం గ్రామంలో ముత్యాల మంగరాజుకి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సర్వం కోల్పోయి బోరున విలపిస్తున్న బాధిత కుటుంబానికి సోమవారం పలువురు వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆపదలో ఉన్న వారికి కొంత సహాయం అందించారు. రెవెన్యూ సిబ్బంది అధ్వర్యంలో నిత్యావసర వస్తువులను అందించినట్టు తెలిపారు. అంకన్నగూడెం పంచాయతీ సర్పంచ్, వార్డు నంబర్లు కలిసి అవసరాల కోసం నిత్యావసర వస్తువులను, రూ.10 వేల నగదును, కట్టుకునేందుకు బట్టలను జెడ్‌పిటిసి మల్లం వసంతరావు, సర్పంచ్ పైడా ముత్యాలమ్మ చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ షమియోల్ బాషా, పైడా రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు

పోలవరం : ప్రభుత్వం రైతులు కష్టాల్లో ఉంటే కనీసం పట్టించుకోవడం లేదని, ధాన్యం మొలకలు వచ్చి ఎందుకు పనికిరాకుండా పోయాయని, కనీసం పండించిన పంటను జాగ్రత్త చేసుకోవటానికి గోనె సంచులు కూడా ఇవ్వలేదని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. కొత్త పట్టిసీమ గ్రామంలో ఐటీఎల్ వచ్చిన మిచౌంగ్ తుపాను ప్రభావంతో రైతులు పండించిన వరి ధాన్యం మొత్తం తడిచి పోవడంతో అక్కడకు వెళ్లి రైతులను పరామర్శించారు. తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ జగన్‌కి అసమర్థ ప్రభుత్వం ఉండటం రైతుల పాలిట శాపంగా ఉందన్నారు. రూ.50 వేలు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త పట్టిసీమ గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రతివాద శ్రీను, పట్టిసీమ పంచాయతీ ప్రెసిడెంట్ సబ్బవరపు శ్రీరామ మూర్తి, దవల వీరన్న పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం : ఎంఎల్ఎ

జంగారెడ్డిగూడెం : పట్టణంలో రూ.3.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని ఎంఎల్ఎ ఎలీజా అన్నారు. సోమవారం వైసిపి పట్టణ అధ్యక్షులు బిటికెల అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో పట్టణంలో పలు సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలీజా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రూ.3.5 కోట్లతో పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కంచర్ల వాసు, ముప్పిడి వీరాంజనేయులు, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు 4,114 దరఖాస్తులు

భీమడోలు : మండలంలో గత సంవత్సరం అక్టోబర్ 27వ తేదీ నుంచి చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సందర్భంగా 4,114 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ తెలిపారు. ఈ నేపధ్యంలో గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెల్లో కార్యక్రమంలో భాగంగా నాలుగు నెలలు రెండు పర్యాయాల చొప్పున మొత్తంగా నాలుగు ప్రత్యేక క్యాంపెయిన్లను నిర్వహించామన్నారు. ఈక్రమంలో నూతనంగా ఓట్ల నమోదు కోసం 1,979, అభ్యంతరాలు తెలుపుతూ 1,277 దరఖాస్తులు, సవరణలు, మార్పులు కోరుతూ 863 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో 2,207 దరఖాస్తులపై విచారణ చేసినట్టు తహశీల్దార్ తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ

ముసునూరు : ఆడుదాం - ఆంధ్రా ఆటలకు యువకులు తమ ప్రతిభ కనబర్చి మరలా తమ చేతుల మీదగా బహుమతులు అందుకోవాలని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రమణక్కపేట, సూరేపల్లి, అక్కిరెడ్డిగూడెం, చక్కపల్లి, లోపూడి, గుళ్లపూడి, వలసపల్లి, చింతలవల్లి, ముసునూరు గ్రామాల్లోని సచివాలయాల్లో ఎంపిడి శ్రీదేవి ఆధ్వర్యంలో వెంకటేశ్వర, ఎంపిఓ జి.రాణిల ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర ఆట వస్తువుల కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి -2 పాముల గంగాధరరావు, కొర్ల గుంట సొసైటీ అధ్యక్షులు మాల్యాని నాగమల్లేశ్వరరావు, సర్పంచులు పేరం కృష్ణ, రంగు ధనలక్ష్మిగాంధీ, రాజబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ముద్ద ప్రవంతి, ప్రసాద్ పాల్గొన్నారు.

'యువగళం' మూడు వేల కిలో మీటర్ల పూర్తి

ముసునూరు : యువగళం పాదయాత్ర 3 వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో కేక్ కటింగ్ చేసి, సంబరాలు జరుపుకున్నట్టు తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రామ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి గంగారావు, మండలపు ధర్మరాజు, కిషోర్, సంతోష్, బన్నీ, మసిముక్కు సుబ్బారావు పాల్గొన్నారు.

పంటనష్టం నమోదు : ఎడి

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో పంట నష్టం నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభమైందని ఎడి ఉషారాణి తెలిపారు. నమోదు కార్యక్రమానికి ప్రత్యేక సర్వే బృందాలు నియామకం జరిగిందన్నారు. దీనిలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామవంచాయతీ కార్యదర్శి సభ్యులుగా ఉంటారన్నారు. వీరు ఎడితో పాటు తహశీల్దార్ పర్యవేక్షణలో పనిచేస్తారని వివరించారు. తుపాను కారణంగా 1,200 ఎకరాల విస్తీర్ణంలో పంట మునిగిపోవడం, ఇతర కారణాల వల్ల నష్టపోవటం జరిగినట్టు ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. వీటి ఆధారంగా ప్రస్తుతం పంట నష్టం నమోదు సర్వే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రాబోయే రెండు రోజులు సర్వే కార్యక్రమం పూర్తైన తర్వాత వివరాలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇంతవరకు 18,816 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందన్నారు. రైతులు వేగవంతంగా ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన గోనె సంచులను సిద్ధంగా ఉంచామని, రవాణా కోసం వాహనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇంకనూ మండల పరిధిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో కోతలు పూర్తి కావాల్సి ఉందని, దీనిలో వెయ్యి ఎకరాల వరకు పంట నీట మునిగిందన్నారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు రక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు. ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్రానికి తుపాన్ హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో రైతులు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని, ఈనెల 15లోగా కోతలను పూర్తి చేసి ఆరబెట్టుకోవటం, మిల్లులకు తరలించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

కళాశాలకు 30 డెస్కుల బహూకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు 30 డెస్కులను బహూకరించిన వసవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రేణుకా చౌదరి దంపతులను సోమవారం మధ్యాహ్నం కళాశాల ప్రాంగణంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తాగిరి బాబు మాట్లాడుతూ విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి కళాశాలకు రూ.2.7 లక్షల విలువైన మన్నిక డ్యూయల్ డెస్కులను బహూకరించడం వారి ఔదార్యానికి నిదర్శనం అన్నారు. విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలన్నారు. అనంతరం సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ కళాశాల మౌలిక వసతుల కల్పనలో భాగస్వాములు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం రేణుకాచౌదరి మాట్లాడుతూ విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్, ఉపాధి కల్పనలో సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిడిసి సెక్రెటరీ అరదం రఘుబాబు, అధ్యాపక బృందం కె.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

పంట నమోదులో రైతులకు నష్టం

ప్రజాశక్తి - ముసునూరు

పంట నష్ట నమోదులో రైతులకు తీవ్ర నష్టం కలుగుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ముసునూరు మండలంలో తుపాను ప్రభావంతో నష్టపోయిన పలు గ్రామాల్లోని పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత విధానంలో రైతు పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించాలని, ఇ-క్రాప్, ఆకౌన్టెల ద్వారా తీవ్ర ప్రభావం చూపుతున్నారన్నారు. సంబంధం లేకుండా ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మేదరమెట్ల సురేంద్ర, ప్రతాప్, గద్దల మోహన్ రావు, సూర్య దేవర శ్రీనివాసరావు, గుడిపాటి అజయ్ కుమార్, కొండేటి బాబీ పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రతిఒక్కరూ పొదుపు ఖాతా కలిగి ఉండాలి

ముదినేపల్లి : ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతా కలిగి ఉండాలని కెడిసిసి గుడివాడ బ్రాంచి మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కొమరులో సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో ఛైర్మన్, సిఇఒ ఆదేశానుసారం, నాబార్డ్ సౌజన్యంతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రజలకు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతా తెరవాలని, పొదుపు ఖాతా కలిగి ఉండడం వలన అనేక లాభాలు పొందవచ్చని చంద్రశేఖర్ ప్రజలకు వివరించారు.

అభివృద్ధి పథంలో 'గుండుగొలను'

ప్రజాశక్తి - భీమడోలు

వైసిపి హయాంలో గ్రామ శాఖ అధ్యక్షులు ముదుంటి సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో గుండుగొలను గ్రామం అభివృద్ధి పథం వైపు పయనిస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. గ్రామ సచివాలయం-1 పరిధిలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాటు వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాల్ని సంయుక్తంగా నిర్వహించారు. ముదుంటి సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందుతున్న పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని అర్హులకు వాటిని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జానీయర్, వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు, గొటికల మురళీ, షేక్ జబీర్, నల్ల శంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ, సూర్యనారాయణ రాజు

జాబ్ మేళాలో 15 మంది ఎంపిక

చింతలపూడి : నేడు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రయివేట్ ఉద్యోగాలలో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని, కాబట్టి నేర్చు, ఓర్పులతో పనిచేస్తే మంచి స్థాయికి చేరుకోవచ్చు అని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస రావు అన్నారు. పట్టణంలో సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివిస్ లేబరేటరీ వారితో కళాశాలలో క్యాంపస్ జాబ్ మేళాలో 31 మంది పాల్గొనగా 15 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు విశాఖపట్నం దివిస్ లెబొరేటరీ లిమిటెడ్ ప్రతినిధి ఎ.రాజేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్.శరత్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎపిఆర్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

GUNTUR MURALIDHARA RAO (Old Name), S/o GUNTURU SAMBA SIVARAO, R/O H.No 4-14, Near Panchayat Office, Chataparru - 534004. Changed my name GUNTUR MURALIDHARA RAO (Old Name) to GUNTURU MURALIDHARA RAO (New Name) for all purposes.
Affidavit No: IN-AP40546293448193V.
Dated 14-11-2023

వైవాకలో 'వై ఏపి నీడ్స్ జగన్'

ముదినేపల్లి : మండలంలోని వైవాక గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వైసిపి శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి లేని పాలనను సిఎం జగన్ అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, సర్పంచ్ నున్న పద్మావతి పాల్గొన్నారు.

దస్తావేజులు పడిపోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం పట్టణంలోని మెంటేవారి తోటలో నివాసం ఉంటున్న తాను అనగా రామిశెట్టి సురేష్, తండ్రి: నరసింహమూర్తి లకు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలో 32వ వార్డు కడకట్ల రామిశెట్టి వారి వీధిలోని డోర్ నెంబర్ 1-3-14 లో 332 1/2 చదరపు గజాల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలమునకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్ తీసుకునే నిమిత్తం ఈనెల అనగా 01-12-2023వ తేదీన వన్ టౌన్‌లోని తాలూకా ఆఫీస్ ఏరియాకు మోటార్ సైకిల్‌పై వస్తుండగా మధ్యలో జారిపడిపోయినవి. కావున దయచేసి దొరికినవారు ఈక్రింది సెల్ నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.
సెల్: 9347630225

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన శ్రీమతి సిద్ధినాశి రాజ్యలక్ష్మి, W/o. సిద్దినాశి వెంకట సూర్య సాంబశివరావు, శాంతినగర్, ఏలూరు, ఏలూరు జిల్లా అను వారు ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని శ్రీమతి వీరేపల్లి బిందు, W/o. హరిహరసుధాకర్, గ్రామం, కామవరపుకోట మండలం, ఏలూరు జిల్లా గ్రామ కొనుగోలు చేయుటకు అను వారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్నారు. సదరు ఆస్తి కొనుగోలు విషయంలో ఎటువంటి లావాదేవీలు ఉన్నా, ఏ యొక్క భిన్న అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి 7 రోజులలోగా సంప్రదించవలెనని కోరుచున్నాము. తదనంతరం ఎటువంటి లావాదేవీలకు నా క్లయింట్ బాధ్యులు కారు అని ఈ పత్రికా ముఖముగా తెలియచేయుచున్నాను.

షెడ్యూల్ ఆస్తి వివరము

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం సబ్ డిస్ట్రిక్ట్, పాత పంగిడిగూడెం ప్రాంతం జంగారెడ్డిగూడెం మండలం, గుర్వాయిగూడెం (గ్రామపంచాయతీ), ఆర్.ఎస్. నెం. 49 ఉ దాఖలా శాశ్వతముగా డాక్యుమెంట్ నెం. 2650/2020 జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రి, జంగారెడ్డిగూడెం ద్వారా గు: 231 స్థలం ఆస్తికి హద్దులు.
తూర్పు: చు:గులు 11లు అర్బలమ్ లెన్ స్థలం.
దక్షిణం: గు: 18లు దిద్ది చంద్రశేఖరరెడ్డి గారి స్థలం.
పడమర: గు: 11లు దిద్ది చంద్రశేఖరరెడ్డి గారి స్థలం.
ఉత్తరం: గు: 24లు బిటికెన సత్యనారాయణ గారి స్థలం.

అంబుల వెంకట నారాయణ
ఏలూరు న్యాయవాది, ఏలూరు
తేది: 11-12-2023 సెల్: 9848422155

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
హెచ్.యమ్.ఓ.పి. నెం. 88/2023

Between:

గంటా @ వలవల కైలాష -పిటీషనర్
మరియు
గంట వెంకటేశ్వరరావు -రెస్పాండెంట

రెస్పాండెంటు: గంట వెంకటేశ్వరరావు, తండ్రి: సంపత్రి, కంద్రిగ, H/o. పాండవ్య, పెంటపాడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, సెల్: 9491171876.

పై నెంబరు కేసులో (H.M.O.P. No. 88/2023) పై కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారము ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు కేసు ది. 28-12-2023వ తేదీ వాయిదా అయి ఉన్నది. కావున మీరు ఖుద్దున కాని, మీ యొక్క న్యాయవాది గారి ద్వారా గాని సదరు వాయిదా రోజు (కోర్టుకు) ఉదయం గం॥ 10.30 ని॥ల లగాయతు హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును అని మీకు ఈ పత్రికా ముఖముగా తెలియజేయడమైనది.

యమ్.గోపాలరావు, అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
ది.08-12-2023 సెల్: 9490648497

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 110/1997

వాదు: 1. రేమణి సత్యవతి (died)
2. మద్దిర వెంకట చంద్రశేఖర్
(2nd Plaintiff added at LR of Deceased 1st Plaintiff as Pr. Order in I.A. No. 983/2014, dated: 25-11-2022)

ప్రతివాదు: సామంచి అనే రేమణి కృష్ణవేణి వగైరా

పై నంబరు దావాలో ప్రతివాది 12 రేమణి సీతామహాలక్ష్మి, W/o. వెంకట సుబ్రహ్మణ్యం, 13. రేమణి జగన్నాథం, S/o. వెంకట సుబ్రహ్మణ్య శర్మ, 14. రేమణి శ్రీనివాస్, S/o. వెంకట సుబ్రహ్మణ్య శర్మ, డోర్ నెం. 27-7-1, గుండవారి పేట, భీమవరం, Bhimavaram SCJC అనుసారం దావా నందు కోర్టు ద్వారాన్ను, రిజిష్టరు పోస్టు ద్వారాను అయులు జరుగుతుండున్న Substituted సర్వీసు అయిలు జరుపుటకుగాను ది. 18-12-2023వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. కావున 12, 13, 14 ప్రతివాద్లు సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో హాజరు అయ్యు ఆక్షేపణలు తెలుపుకొను వలెను. లేని యెడల 12, 13, 14 ప్రతివాద్ల పరోక్షముగ పై దావా తీర్మానించబడును అని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

కాళ్లకూరి కుసుమ హరనాధ్
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
సెల్: 9963954564

In the Court of the Hon'ble Addl. Senior Civil Judge, Eluru
E.A. No. 307/2023 in
E.A. No. 342/2018 in
E.P. No. 28/2017 in
O.S. No. 281/2007

Between:
1. Gullapudi Dhananjaya Rao (died)
2. Gullapudi Syamala and Others
...Petitioners/ D.Hrs
AND
Rayee Vimala @ Vimala Devi and Others
...Respondents/ JDr/ Proposed Respondents

To:
R-2: Gajavali Venkateswara Rao, S/o. Subba Rao, D.No. 4-21, Subbammadevi School Road, Eluru, Eluru District.

పై నెంబరు పిటీషనులో శ్రీ కోర్టు వారు 2వ రెస్పాండెంటు మీరు హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డరు చేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీయొక్క హాజరు నిమిత్తం ది. 15-12-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు ద్వారా గాని హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు పిటిషను పరిష్కరించబడునని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

G.V.ANAND KUMAR, Advocate
Eluru, Cell: 9848427001